విషాదంలోనూ ఆదర్శ నిర్ణయం..!

- ఇద్దరికి చూపునిచ్చేలా నేత్రదానం
- రోహిణి కుటుంబ సభ్యుల ఔదార్యానికి సదాశయ ఫౌండేషన్ అభినందనలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి అక్టోబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

కుటుంబంలో తీరని విషాదం నెలకొన్న వేళ.. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు దాడి రోహిణి (36) కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకొచ్చారు. అనారోగ్య కారణాలతో రోహిణి అకాల మరణం చెందగా, ఆమె నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. సదాశయ ఫౌండేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కే. శంకర్‌రావు సోదరుడి కుమార్తె రోహిణి. ఆమె మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ, శంకర్‌రావు నేత్రదానంపై అవగాహన కల్పించి వారిని ఒప్పించారు. దీంతో రోహిణి నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఆమె భర్త మురళి ఎన్టీపీసీలో ఉద్యోగి. కుమార్తెలు శ్రీవల్లి, శ్రీనిధి ఉన్నారు. రోహిణి పార్థివదేహాన్ని స్వగ్రామమైన పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.విషాద సమయంలోనూ ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించేలా కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం స్ఫూర్తిదాయకమనిసదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు సానా రామకృష్ణారెడ్డి, నూక రమేష్, లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి, వెల్దీ కవిత, అనంతరాములు, కే.ఎస్. వాసు, రాజమౌళి, లక్ష్మీనారాయణ, రాములు, అన్నపూర్ణ, శశికళ, జ్యోతి తదితరులు అభినందించారు. రోహిణి అకాల మరణం పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాఠం చెప్పే గురువు- ప్రాణం పోసే దాత: 32 సార్లు రక్తదానం చేసిన జమీల్ అహ్మద్

- అభినందించిన జిల్లా ఎస్పీ: రాజేష్ చంద్ర



కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి /అక్టోబర్ 24/ అక్షరం న్యూస్: ఒక పక్క విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దు తూ,మరోపక్క రక్తదానం చేస్తూ, వందలాదిమంది ప్రాణా లను కాపాడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఘన స న్మానం జరిగింది. ఆ ఉపాధ్యాయుడు ఇప్పటివరకు ఏ కంగా 32 సార్లు రక్తదానం చేశాడు. ఎల్లారెడ్డి పట్టణ కేం ద్రానికి చెందిన మొహమ్మద్ జమీల్ అహ్మద్ కామారెడ్డి జిల్లా తాడువాయి మండల కేంద్రంలోని సంగోజివాడి ప్ర భుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహి స్తున్నాడు.పుస్తకాల పాఠమే కాదు.. ప్రాణం విలువను కూడానేర్పుతున్న గురువు ఈయన. ప్రభుత్వ ఉపాధ్యా యుడిగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దుతూనే, ఇ ప్పటివరకు 32సార్లు రక్తదానం చేసి ఎంతో మందికిపున ర్జన్మ ఇచ్చారు.ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే, ఆ యన జిల్లా రక్తదాతల సమూహ అధ్యక్షుడిగా కూడా త న సేవలను అందిస్తున్నారు. ఇందులో భాగంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివా రం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన రక్తదాన శి బిరంలో 32వసారి రక్తదానం చేశారు.ఇప్పటివరకు ఆ యన చేసిన సేవలను గుర్తిస్తూ, కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, రెడ్ క్రాస్ రాష్ట్ర బాధ్యులు జైపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంజీవ రెడ్డి, ఈసీ మెంబర్ డాక్టర్ బాలు తదితరులు ఆయనకు అభినందించారు.ఈ సందర్భంగా జిల్లారక్తదాతలసమూ హ అధ్యక్షుడు జమీల్ అహ్మద్ మాట్లాడుతూ.. నేను చే సేది చిన్న సాయమైనా.. అది ఒకరి ప్రాణాన్ని నిలబెట్టు తుందంటే అంతకంటే సంతోషం ఏముంటుందని అన్నా రు. రక్తదానం చేస్తే శరీరం బలహీన పడదు... మనసు ఉ లపడుతుందని ఆయన అన్నారు. రక్తదానం ద్వారా మ రో ప్రాణం నిలబడుతుందని, రక్తదానం చేస్తే ఆరోగ్యం త గ్గుతుందనే భయం వీడి, యువత రక్తదానానికి ముందు కు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

జీర్ణక్రియకు మేలు చేసే ఫైబర్ జెల్లీ.. తయారీ ఇలా..

రోజువారీ ఆహారంలో తగినంత పీచు పదార్థం తీసుకోవడం జీర్ణక్రియ సక్రమంగా సాగడానికి, మలవిసర్జన క్రమబద్ధంగా ఉండడానికి, పేగుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎంతో అవసరం. అయితే, ఆహారం ద్వారా మాత్రమే శరీరానికి సరిపడా పీచు పదార్థాన్ని పొందడం చాలామందికి సాధ్యం కావడం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా పోషకాహార నిపుణులు సులభంగా తయారు చేసుకోగలిగే అధిక పీచు పదార్థం కలిగిన జెల్లీ తయారీ విధానాన్ని వెల్లడించారు. ఈ జెల్లీ మలవిసర్జన సజావుగా జరిగేందుకు తోడ్పడడంతోపాటు రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండేందుకు కూడా సహాయపడుతుందని పేర్కొంటున్నారు. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో పోషకాహార నిపుణురాలు దీపశిఖా జైన్ ఈ జెల్లీ తయారీ విధానాన్ని వివరించారు. ఈ వంటకాన్ని ఇంతకు ముందు ఎందుకు ప్రయత్నించలేదా అని అనిపిస్తోందని, ఇది జెల్లీలా ఉన్నప్పటికీ అధిక మొత్తంలో పీచు పదార్థాన్ని అందిస్తుందని ఆమె తెలిపారు. ప్రతిరోజూ రాత్రి నిద్రపోయే ముందు ఈ జెల్లీని ఒక చెంచా తీసుకుంటానని వెల్లడించారు. దీని తయారీ కూడా ఎంతో సులభమని వివరించారు.

అధిక పీచు పదార్థం కలిగిన జెల్లీని ఎలా తయారు చేయాలి?

ముందుగా ఒక చిన్న గాజు సీసా తీసుకోవాలి. అందులో రెండు టేబుల్ స్పూన్ల ఇసబ్గోల్ లేదా సైలియం హస్క్ వేయాలి. ఈ జెల్లీ తయారీలో ఇదే ప్రధాన పదార్థమని ఆమె తెలిపారు. అనంతరం అర కప్పు కొంబుచా కలపాలి.

పల్లె మహిళాలకు ఉద్యోగావకాశాలు

- ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలి: ఏపీఎం వేణు..



హనుమకొండ జిల్లా/
భీమదేవరపల్లి/ అక్టోబర్ 24/ అక్షరం న్యూస్:-

సమగ్ర క్లస్టర్ విధానం (ఐఎఫ్‌సీ)లో భాగంగా భీమదేవరపల్లి మండలంలో కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న పల్లె మహిళా జీవనోపాధి కేంద్రంలో రెండు రకాల పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎం వేణ, శనివారం ఒక ప్రకటన తెలిపారు. భీమదేవరపల్లి, కొత్తపల్లి, కొప్పూరు, సాయినగర్, విశ్వనాథకాలనీ గ్రామాల పరిధిలోని మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు.

రెండు రకాల పోస్టులు..

పల్లె మహిళా జీవనోపాధి కేంద్రం కో-ఆర్డినేటర్ పోస్టుకు పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. బుక్ కీపింగ్, కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు స్వయం సహాయక సంఘాల్లో పనిచేసిన అనుభవం ఉండాలి. ఈ పోస్టుకు నెలకు రూ.8,000 గౌరవ వేతనం చెల్లిస్తారు. సీనియర్ సీఆర్పీ పోస్టుకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు వ్యవసాయం, పశు సంవర్ధక, జీవనోపాధి రంగాల్లో ఎఫ్‌పీవో, ఎంఎంఎస్ లేదా ఎన్జీవో సంస్థల్లో పనిచేసిన అనుభవం ఉండాలి. ఈ పోస్టుకు నెలకు రూ.10,000 గౌరవ వేతనం అందజేస్తారు.

29 చివరి గడువు..

దరఖాస్తు చేసుకునే మహిళల వయస్సు 18 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలని ఏపీఎం వేణు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 29వ తేదీలోగా భీమదేవరపల్లిలోని భరతమాత మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఏపీఎం వేణు సూచించారు.

యెర్గి లో ఘనంగా సార్వజనిక బతుకమ్మ ఉత్సవం సర్పంచ్ సంతోష్ పాటిల్

మద్నూర్ / అక్టోబర్ 24 (అక్షరం న్యూస్ - కామారెడ్డి)



చాళుక్యుల కాలం నాటి చారిత్రక నగరంగా పేరొందిన యేరగి గ్రామంలో సార్వజనిక బతుకమ్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఏర్గి సర్పంచ్ సంతోష్ పాటిల్ ఎర్గికర్ తెలిపారు . తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళల కోసం ప్రత్యేకంగా బతుకమ్మల అలంకరణ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నాందేడ్ జిల్లా దెగ్లూర్ తాలుక యెర్గి గ్రామంలోని హనుమాన్ మందిరం ప్రాంగణంలో సోమవారం, అక్టోబర్ 26న మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా మహిళలు, సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంప్రదాయ బతుకమ్మలను అందంగా అలంకరించి పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

విజేతలకు నగదు బహుమతులు

బతుకమ్మల అలంకరణ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నారు.

మొదటి బహుమతి: రూ. 2,222.
రెండో బహుమతి: రూ. 1,111.
మూడో బహుమతి: రూ. 777.
ప్రోత్సాహక బహుమతులు: ఒక్కొక్కరికి రూ. 555 చొప్పున అందజేయనున్నారు.

పోటీ నియమాలు

బతుకమ్మల అలంకరణకు సహజమైన పూలనే ఉపయోగించాలి. బతుకమ్మ ఎత్తు, పూలతో చేసిన అలంకరణను పరిశీలించి న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేస్తారు. పోటీలు పూర్తయిన అనంతరం బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తారు. న్యాయనిర్ణేతల నిర్ణయమే తుది నిర్ణయంగా ఉంటుంది.

మహిళలంతా పాల్గొనాలి

బతుకమ్మ పండుగ తెలంగాణ, మహారాష్ట్ర ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక అని సర్పంచ్ సంతోష్ పాటిల్ పేర్కొన్నారు. మహిళలందరూ ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సర్పంచ్ సంతోష్ పాటిల్ గ్రామ సార్వజనిక బతుకమ్మ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వేదిక: హనుమాన్ మందిరం ప్రాంగణం, ఏర్గి గ్రామం, దేగ్లూర్ తాలూకా.నిర్వాహకులు: సంతోష్ పాటిల్ ఎర్గికర్.సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 9094707777.

పి.టి. స్వామి మృతి బాధాకరం

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సంతాపం



జ్యోతి నగర్ ఎన్టిపిసి అక్టోబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ గోదావరిఖనికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ సీనియర్ సిటిజన్ సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు, వాణి విద్యా విహార్ వ్యవస్థాపకులు పి.టి. స్వామి మృతి పట్ల మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.పి.టి. స్వామి మరణం బాధాకరమని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

పంచాయితీ సెక్రటరీ మృతికి నివాళులు



రామగిరి (పెద్దపెల్లి జిల్లా) అక్టోబర్ 24 అక్షరం న్యూస్:

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన శనిగరపు జైపాల్ పార్థివ దేహానికి శనివారం పలువురు నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు మంథని మండలం సూరయ్యపల్లె పంచాయితీ సెక్రటరీ గా విధులు నిర్వహిస్తున్నారు. ముత్తారం మండలం ఓడేడు వాగు వద్ద ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందారు. మృతుడి స్వగ్రామమైన రత్నాపూర్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు, రామగిరి ఎఎస్ఐ ఈదునూరి స్వామి, రత్నాపూర్ సెక్రటరీ గంగుల సంతోష్, మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, నాయకులు బొంగరాల రవి, వేగోళపు మల్లయ్య, కండె పోషం, బండారి సదానందం, ఎరుకల బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక లో సర్పంచ్ ల ప్రేక్షక పాత్ర పై సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ఆవేదన..

- సర్పంచ్ లది ఏమి లేదని మండలస్థాయి అధికారి నోట పలుకు
- అసంతృప్తి వ్యక్తం చేసిన సర్పంచ్ లు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /అక్టోబర్ -24(అక్షరం న్యూస్)

ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన సర్పంచ్‌లను అగౌరవపరుస్తూ వాళ్లు తీర్మానం చేసి ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల లిస్ట్ ఎంపిక చేయడం తో గ్రామం లో అర్హులైన వారికీ తాము సమాధానం చెప్పలేక పోతున్నామని ముస్తాబాద్ మండల అధికార పార్టీ ప్రతి పక్ష పార్టీ సర్పంచ్ లు శనివారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశం లో మండల స్థాయి అధికారి దృష్టి కీ తీసుకోని రావడం తో ఆ అంశం ఈ సమావేశం లో మాట్లాడేది కాదని అనడం తో సర్పంచ్ లు అసంతృప్తి వ్యక్తం చేశారు.. దీనిపై స్పష్టత ఇవ్వాలని గట్టిగ అడగడం తో అసలు సర్పంచ్ లకు ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధం లేదని అనడం తో కంగు తిన్నారు.గ్రామస్థాయిలో పేదల సమస్యలు, కుటుంబాల ఆర్థిక పరిస్థితులు, నివాస పరిస్థితులపై ప్రత్యక్ష అవగాహన కలిగిన సర్పంచులను లబ్ధిదారుల ఎంపిక, అర్హతల పరిశీలన, ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణలో భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై జిల్లా కలెక్టర్, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి కీ తీసుకెళతామని సర్పంచ్ లు తెలిపారు అధికార పార్టీ లో ఉన్న సర్పంచ్ లు కూడ అసంతృప్తి వెళ్ళిబుచ్చడం చర్చనీ అంశంగా మారింది

రక్తదానం..మరొకరికి పునర్జన్మ

- పోలీస్ సంస్మరణ వారోత్సవాల్లో భీమదేవరపల్లి మండల యువత సేవా స్ఫూర్తి..కాజీపేట
- ఏసీపీ ప్రశాంత్ రెడ్డి..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ అక్టోబర్ 24/అక్షరం న్యూస్:-
రక్తదానం చేయడం అంటే కేవలం రక్తాన్ని ఇవ్వడం మాత్రమే కాదని ఆపదలో ఉన్న ఒక నిండు ప్రాణాన్ని కాపాడటమేనని భీమదేవరపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. పోలీస్ సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం కాజీపేట డివిజన్ పరిధిలోని మడికొండ గార్డెన్స్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో భీమదేవరపల్లి మండల యువతను సమన్వయం చేసిన అనిల్ కుమార్ యాదవ్.. యువకులను స్వచ్ఛందంగా రక్తదానం చేసేలా ప్రోత్సహించారు. యువత పెద్ద సంఖ్యలో సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా కృషి చేసి శిబిరం విజయవంతానికి తోడ్పడ్డారు.
రక్తదానం చేసిన భీమదేవరపల్లి మండల యువతను కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ముల్కనూర్ ఎస్సై రాజు మాట్లాడుతూ.. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండాలని అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి బాధితుల ప్రాణాలు కాపాడటంలో భాగస్వాములు కావాలని సూచించారు.
ప్రాణదాతలుగా యువకులు
ఈ శిబిరంలో అదరి రాజేందర్, విలేఖరి మేకల శ్యామ్, రాజేష్, కత్తుల అజయ్ కుమార్, ఎల్లి వినోద్, గుల్ల తిరీష్, మేకల హరీష్, అమోఘవర్ధి, సందీప్, కృషిధర్, జయంత్, అరుణ్ తదితరులు రక్తదానం చేశారు. యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయడం పలువురిని ఆకట్టుకుంది.

పండుగల వేళ జీర్ణ సమస్యలా? ఇంట్లోనే తయారు చేసుకోండి ఈ 4 ప్రోబయోటిక్ ఆహారాలు!



పండుగల సమయంలో పిండి వంటలు, నూనెలో వేయించిన చిరుతిళ్లు, స్వీట్లు, మసాలా వంటకాలు ఎక్కువగా తినడం వల్ల కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇలాంటి సమయంలో పేగుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు ఉండే ప్రోబయోటిక్ ఆహారాలను తీసుకోవడం ఉపయోగపడుతుంది.

ప్రోబయోటిక్ ఆహారాలు అంటే ఏమిటి?

ఆహారంలోని చక్కెరలు, పిండి పదార్థాలను బ్యాక్టీరియా, ఈస్ట్ వంటి సూక్ష్మజీవులు విచ్ఛిన్నం చేసే సహజ ప్రక్రియను కిణ్వ ప్రక్రియ అంటారు. అయితే కిణ్వ ప్రక్రియకు గురైన ప్రతి ఆహారం ప్రోబయోటిక్ కాదు. ఇడ్లీ, దోశ, ధోక్లా వంటి పదార్థాలు కిణ్వ ప్రక్రియ ద్వారా తయారైనా, వాటిని ఉడికించడం వల్ల ప్రయోజనకరమైన జీవ బ్యాక్టీరియాలో కొంత భాగం నశిస్తుంది. పేగుల్లో బ్యాక్టీరియా సమతుల్యతను కాపాడడానికి జీవ సూక్ష్మజీవులు ఉండే ఆహారాలు తోడ్పడతాయి.

ఇంట్లోనే తయారు చేసుకోగలిగే 4 ప్రోబయోటిక్ ఆహారాలు

పులియబెట్టిన అన్నం గంజి: ఉడికించిన అన్నాన్ని శుభ్రమైన తాగునీటిలో వేసి మూతపెట్టి, వాతావరణ పరిస్థితులను బట్టి 8–12 గంటలు ఉంచాలి. మరుసటి రోజు తాజాగానే తీసుకోవచ్చు. కావాలనుకుంటే కొద్దిగా ఉప్పు కలుపుకోవచ్చు. అయితే పరిశుభ్రత పాటించడం, ఆహారం సురక్షితంగా పులిసిందని నిర్ధారించుకోవడం ముఖ్యం.రాగి గంజి: రాగి పిండిని నీటితో కలిపి మెత్తని గంజిలా ఉడికించాలి. పూర్తిగా చల్లారిన తర్వాత జీవ సూక్ష్మజీవులు ఉండే పెరుగును ఒక చెంచా కలపాలి. శుభ్రమైన పాత్రలో మూతపెట్టి, వెచ్చని ప్రదేశంలో 6–8 గంటలు ఉంచాలి. కిణ్వ ప్రక్రియ పూర్తయ్యాక ఫ్రిజ్‌లో పెట్టాలి.ఇంట్లో తయారుచేసే గ్రీక్ యోగర్ట్: 500 మిల్లీలీటర్ల పాలను వేడి చేసి, గోరువెచ్చగా అయ్యాక జీవ సూక్ష్మజీవులు ఉండే పెరుగును 1–2 చెంచాలు కలపాలి. మూతపెట్టి 6–10 గంటలు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి. పెరుగు గడ్డకట్టిన తర్వాత ఫ్రిజ్‌లో పెట్టాలి. అనంతరం శుభ్రమైన పలుచని వస్త్రంలో 2–4 గంటలు వడకడితే చిక్కగా ఉండే గ్రీక్ యోగర్ట్ సిద్ధమవుతుంది.ఉసిరికాయ పచ్చడి తరహా కిణ్వీకృత ఆహారం: తాజా ఉసిరికాయలను కడిగి పూర్తిగా ఆరబెట్టి ముక్కలుగా కోయాలి. ప్రతి కిలో ఉసిరికాయలకు 20 గ్రాముల ఉప్పు కలిపి, ఉడికించి చల్లార్చిన నీటిలో పూర్తిగా మునిగేలా శుభ్రమైన గాజు సీసాలో ఉంచాలి. కిణ్వ ప్రక్రియ కోసం కొన్ని రోజులు గది ఉష్ణోగ్రత వద్ద ఉంచి, పుల్లని రుచి వచ్చిన తర్వాత ఫ్రిజ్‌లో పెట్టాలి. ఈ ప్రక్రియలో పరిశుభ్రత, సరైన ఉప్పు పరిమాణం, సురక్షితమైన కిణ్వీకరణ ఎంతో ముఖ్యం. పండుగల సమయంలో ఆహారాన్ని ఆస్వాదిస్తూనే జీర్ణవ్యవస్థ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి. అయితే ఈ ఆహారాలన్నీ ప్రతి ఒక్కరికీ ఒకే విధంగా పనిచేయవు. కడుపు ఉబ్బరం తరచూ వస్తుంటే లేదా తీవ్రమైన జీర్ణ సమస్యలు ఉంటే వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

రాజకీయ కురువృద్ధుడు పి.టి. స్వామి కన్నుమూత





- ఉపాధ్యాయుడిగా, విద్యావేత్తగా, రాజకీయ నాయకుడిగా విశేష సేవలు

జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన సీనియర్ నాయకుడు, మాజీ ఉపాధ్యాయుడు, విద్యావేత్త పి.టి. స్వామి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం వసంత్‌నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించడంతో గోదావరిఖని ప్రాంతంలో విషాదం నెలకొంది. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయ రంగంలోకి ప్రవేశించి, విద్యా సేవలు, కార్మిక ఉద్యమాలు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.1970లో గోదావరిఖని జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన పి.టి. స్వామి, అనంతరం విద్యారంగంలోనూ తనదైన ముద్ర వేశారు. 1985లో మార్కండేయ కాలనీలో వాణి విద్యా విహార్ పాఠశాలను ప్రారంభించి, దానిని కళాశాల స్థాయి వరకు అభివృద్ధి చేశారు. ఈ విద్యాసంస్థలో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారు. ఒకవైపు విద్యాసంస్థను అభివృద్ధి చేస్తూనే, మరోవైపు రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించడం ఆయన ప్రత్యేకత.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కీలకంగా పనిచేసిన ఆయన, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. ఆ సమయంలో జిల్లాలో ప్రముఖ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఎడ్ల మల్లయ్యతో కలిసి జిల్లాలో పార్టీకి సంబంధించిన రెండు వర్గాల్లో కీలకంగా వ్యవహరించిన నాయకుల్లో ఆయన ఒకరు. ఆయన సేవలను గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రత్యేకంగా గుర్తించేవారని పార్టీ వర్గాల్లో పేరుంది. సిరిసిల్ల ఎస్ఎస్ బోర్డు చైర్మన్‌గా కూడా పనిచేశారు.కాంగ్రెస్ పార్టీలోనూ కొంతకాలం పనిచేసిన పి.టి. స్వామి, మాజీ స్పీకర్, మంథని మాజీ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీపాదరావుతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. మాజీ కేంద్రమంత్రి కాకా వెంకటస్వామితోనూ కలిసి పనిచేశారు. 1998లో మున్సిపల్ చైర్మన్ పదవికి పార్టీ టికెట్ లభించకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ రాజకీయాలకు దూరం కాకుండా తన ప్రస్థానాన్ని కొనసాగించారు.తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావ సమయంలో కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీలో చేరిన ఆయన, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ప్రారంభం, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. సింగరేణి కార్మికుల సమస్యలు, స్థలాల క్రమబద్ధీకరణ ఉద్యమాలు సహా పలు కార్మిక పోరాటాల్లో పాల్గొన్నారు. రామగుండం, మంథని ప్రాంతాల్లో పార్టీ అభ్యర్థులకు అండగా నిలుస్తూ, నామినేషన్ల దాఖలు నుంచి ఎన్నికల ప్రచారం వరకు బాధ్యతలు నిర్వహించేవారు. రాజకీయంగా ఉన్నత పదవులు దక్కాల్సిన స్థాయి, అనుభవం ఉన్నప్పటికీ ఆయనకు తగిన గుర్తింపు లభించలేదనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో ఉంది.రాజకీయాలతోపాటు సామాజిక సేవకు ప్రాధాన్యమిచ్చిన పి.టి. స్వామి, వీర్లపల్లిలో ఈశ్వర కృప వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ వృద్ధులకు సేవలందించారు. విద్య, రాజకీయాలు, కార్మిక ఉద్యమాలు, సామాజిక సేవా రంగాల్లో తనదైన ముద్ర వేసిన ఆయన మృతి స్థానికంగా విషాదాన్ని నింపింది. ఆయన మరణంతో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడిని, విద్యాభివృద్ధికి కృషి చేసిన సేవాభావం గల వ్యక్తిని ప్రాంతం కోల్పోయింది. సింగరేణిలో స్టోర్ లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులను ఆయన పర్మనెంట్ చేయించిన ఘనత దక్కించుకున్నారు.



నిర్ణీత కాలవ్యవధి లోపు ప్రభావిత ప్రాంతమైన

జనగామ గ్రామ సమస్యలన్నీ పరిష్కరించండి



జ్యోతి నగర్ ఎన్టిపిసి అక్టోబర్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
నిర్ణీత కాలవ్యవధి లోపు ప్రభావిత ప్రాంతమైన జనగామ గ్రామ సమస్యలన్నీ పరిష్కరించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో జనగామ గ్రామస్తులు , సింగరేణి , మునిసిపల్ అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ గ్రామస్తులు పలు సమస్యలను దృష్టికి తెచ్చారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఎస్ సి సి ఎల్ , ఆర్ జి వన్ జి ఎం కార్యాలయ పరిధిలోనే అనేక సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉందని అన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో నిరూపయోగమైన పైప్ లైన్ల స్థానంలో సుమారు 500 మీ వరకు కొత్త పైప్ లైన్ వేసినట్లయితే జనగామ లో గతంలో మారదిరిగా నల్లాల ద్వారా ఇంటింటికీ మంచి నీటి సరఫరా చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే ఎల్ నినో తో ఏర్పడబోతున్న నీటి కరువు తట్టుకోవడానికి కుంగిపోయిన బోర్లు , పని చేయని బోర్లు , ఖాళీ గా ఉన్న బోర్లను యుద్ద ప్రాతిపదికన మరమ్మత్తు చేయించడంతో పాటు గ్రామంలో ఆర్ ఓ ప్లాంట్ కూడా ఉపయోగంలోకి తీసుకురావాలని అన్నారు. కొత్త బోర్లు కూడా వేయాలని అన్నారు . పవర్ హౌజ్ కాలనీ లో కొత్త గా నిర్మితమవుతున్న వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తవుతే జనగామ కు నగర పాలక సంస్థ నిరంతర నీటి సరఫరా చేస్తుందని అన్నారు. అలాగే సింగరేణి తరపున గ్రామం లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. పాత వీధి దీపాలు , సోలార్ లైట్లు పునరుద్దరించడంతో పాటు కొత్తగా 50 వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. జనగామ గ్రామ అభివృద్ధి స్పెషల్ ప్యాకేజీ నిధులు మంజూరు చేయాలని కోరారు. వరద ప్రభావం పడకుండా శ్లాబ్ కల్వర్ట్ లు , ఉపరి తల కాలువల నిర్మాణం చేపట్టాలని అన్నారు. వన్ ఇంక్ లైన్ జనగామ చౌరస్తా వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. శివాలయం నుండి గోదావరి వైపు వెళ్ళే దారిలో ఇసుక లారీల కారణంగా చేసిపోయిన రోడ్డును మరమ్మత్తు చేయించాలని అన్నారు. ఈ రోడ్డు కల్వర్ట్ కు అవసరమైన నిధులు ఎం ఎల్ఎ సహకారంతో మంజూరయ్యేలా చర్యలు తీసుకుందామని అన్నారు. ఎస్ టి పి నిర్మాణం పూర్తి కావచ్చినందున జనగామ చెరువులోకి మురుగు నీరు చేరకుండా ఉంటుందని అన్నారు.బోర్ వెల్ కుంగిన నేపధ్యంలో జనగామ గ్రామ భద్రత దృష్ట్యా నిపుణుల బృందంతో అధ్యయనం చేయించాలని అన్నారు. అనంతరం జి ఎం మాట్లాడుతూ గోదావరి వైపు వెళ్ళే రోడ్డు జనగామ గ్రామ ప్రజలతో పాటు సింగరేణి సంస్థ కు కూడా ఉపయోగకరమైనందున అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జనగామ గ్రామస్తులు దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించడానికి సోమవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని పనులు పూర్తి చేస్తామని అన్నారు.అందరి సమన్వయంతో జనగామ గ్రామాన్ని ఉత్తమ గ్రామం గా తీర్చిదిద్దుదామని అన్నారు. కుంగుబాటుకు సంబందించి నిపుణుల బృందం తో గ్రామంలో అధ్యాయనం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , కార్పొరేటర్లు ఆవుల శ్యామణి , ముస్తాఫా పలువురు కార్పొరేటర్లతో పాటు సింగరేణి ఆర్ జి వన్ జి ఎం లలిత్ కుమార్ , ఏజెంట్ రమేష్ , డి జి ఎం ఎక్స్ ప్లో రేషన్ రమేష్ బాబు , ఎన్ పి డి సి ఎల్ ఎ డి ఇ గుండు శ్రీనివాస్ ,పలువురు జనగామ గ్రామస్తులు , నాయకులు పాల్గొన్నారు.

వరికొనుగోలు కేంద్రం ప్రారంభం



కామారెడ్డిజిల్లా/ ఎల్లారెడ్డి/ అక్టోబర్ 24/ అక్షరంన్యూస్:
ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణ లో, సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన వ రి కొనుగోలు కేంద్రాన్నిఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ నాగం గం గారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకట్ రామ్ రెడ్డి,మునిసిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ తో కలిసి శనివా రం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడు తూ, రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి,మద్దతు ధర పొందాలని సూ చించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా అవసరమైన సౌకర్యాలు క ల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.రైతుల సంక్షే మం కోసం,వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందు కు కొనుగోలు కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయ ని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ చై ర్మన్ పద్మ శ్రీకాంత్, ఏఎంసీ చైర్పర్సన్ రజిత వెంకట్రామి రెడ్డి, ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కురు మ సాయిబాబా,మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారిని శోభ,ఏఈఓ ముఖిద్, సొసైటీ సీఈఓ విశ్వనాథం, వివిధ సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, వివిధ కౌన్సిలర్లు, కో ఆప్షన్ స భ్యురాలు,పట్టణ కమిటీ నాయకులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలు సుశీల మృతికి నివాళి

- సుశీల సేవలు చిరస్మరణీయం
- గ్రామ పరిశుభ్రతకు ఆమె సేవలు మరువలేనివి..
- స్థానికసర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ అక్టోబర్ 24/అక్షరం న్యూస్:-

మండలంలోని గాంధీనగర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు తూముల సుశీల అకాల మరణం పట్ల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు

గ్రామ పంచాయతీ పాలకవర్గం

సంతాపం వ్యక్తం చేశారు. శనివారం ఆమె నివాసానికి చేరుకుని ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజ్, సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పరిశుభ్రత, అభివృద్ధి కోసం సుశీల అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ఎండనక, వాననక వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆమె చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. సుశీల మృతి గ్రామానికి తీరని లోటని ఆమె కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, సహచర కార్మికులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

చలో హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయండి

రాజన్న సిరిసిల్ల / ముస్తాబాద్ / అక్టోబర్- 23(అక్షరం న్యూస్)

రాష్ట్రంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ముస్తాబాద్ మండల కేంద్రంలో సి డబ్ల్యూ ఎఫ్ ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గీస బిక్షపతి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులతో కలసి చలో హైదరాబాద్ మల్టిపుల్ మహా ధర్నా పోస్టర్ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25 26 తేదీలలో నిర్వహించే మల్టిపుల్ డ్రెస్ మహా ధర్నా కార్యక్రమానికి కార్మిక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పారిశుద్ధ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పల్లాటి బాబు సుధాకర్ పోచలయ్య వట్టి నర్సింలు మల్లేశం బాలెళ్ళు రాజవ్వ లక్ష్మి శ్రీనివాస్ రంజాన్ రాజయ్య రాజవ్వ లక్ష్మి సావిత్రి తదితరులు పాల్గొన్నారు

ఎంపీడీవో సందర్శన: అభివృద్ధి పనులపరిశీలన



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/అక్టోబర్ 24/అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని వెంకటాపూర్ గ్రామాన్ని ఎంపీడీవో తాహీర బేగం శనివారం సందర్శించారు. గ్రామపంచాయతీ, అంగన్వాడి కేంద్రంతో పాటు జలశ్రీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా టి హెచ్ ఆర్,ఎస్ఏఎం,ఎంఏఎం లకు సంబంధించిన వివరాలతో పాటు రికార్డులను స్టేషనరీని తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రంలో పోషకాహార కార్యక్రమాల అమలు, రికార్డుల నిర్వహణపై వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జలశ్రీ పనుల కింద చేపట్టిన మ్యాజిక్ సోక్ ఫిట్,డ్రైన్ అండ్ సోక్ ఫిట్, కమ్యూనిటీ సోక్ ఫిట్ తదితర పనులను పరిశీలించారు. ఈ పనుల ప్రస్తుత స్థితిగతులను సమీక్షించి, వాటి నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే సేవలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు పారిశుధ్యం, నీటి సంరక్షణకు సంబంధించిన పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఏపీఓ, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో వైద్యం.. ప్రాణాలు కాపాడాలి





- పీఎం రాహత్ పథకం కింద రూ.1.50 లక్షల వరకు ఉచిత చికిత్స
- ఆసుపత్రుల నమోదు, ప్రమాద కేసుల ఆన్‌లైన్ వివరాలపై ప్రత్యేక దృష్టి

సూర్యాపేట, టౌన్ అక్టోబర్ 24: అక్షరం న్యూస్

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రమాదం జరిగిన తొలి గంటలోనే (గోల్డెన్ అవర్) వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకం ద్వారా అర్హులైన బాధితులకు రూ. 1.50 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అందించాలని సూచించారు.పీఎం రాహత్ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ప్రమాద బాధితులను సమీపంలోని ప్రభుత్వ లేదా పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి తక్షణ వైద్య సేవలు అందించాలని తెలిపారు. చికిత్స ఖర్చుల కారణంగా ప్రాణరక్షణలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. పథకం అమలుతో రాష్ట్రవ్యాప్తంగా ఏటా సుమారు రూ.100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధులు ఆదా అయ్యే అవకాశం ఉందన్నారు.

ఆసుపత్రులు, ప్రమాద కేసుల నమోదు తప్పనిసరి

పీఎం రాహత్ పథకం అమలుకు అన్ని అర్హ ఆసుపత్రులు సంబంధిత పోర్టల్‌లో నమోదు కావాలని సీఎస్ సూచించారు. ప్రతి రోడ్డు ప్రమాద కేసును ఈ-డీఏఆర్ పోర్టల్‌లో నమోదు చేసి, వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. పోలీసు అధికారులు ప్రమాద కేసుల ధ్రువీకరణను వేగంగా పూర్తి చేయాలని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఈ ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని తెలిపారు.ప్రమాద బాధితులకు అందించిన చికిత్సకు సంబంధించిన క్లెయిమ్‌లను త్వరగా పరిశీలించి, నిబంధనల ప్రకారం ఆసుపత్రులకు నిధులు విడుదల చేయాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పథకాన్ని జిల్లాలో తక్షణమే అమలు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ, జిల్లాలో పీఎం రాహత్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోడ్డు ప్రమాద కేసును నమోదు చేసి, అర్హులైన బాధితులకు పథకం ద్వారా వైద్య సేవలు అందేలా చూడాలన్నారు.జిల్లాలోని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులు పథకంలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాద ప్రాంతాలను గుర్తించి బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించేలా పోలీసు, వైద్య, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవల్లో ఆసుపత్రుల నమోదు, పరిపాలనా ప్రక్రియల కారణంగా జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకటరమణ, జిల్లా రవాణా అధికారి పురుషోత్తం రెడ్డి, డీపీఓ యాదగిరి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనుషతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు.. ఇద్దరు యువకులు దుర్మరణం

- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు.. భవానీ మాల విరమణకు వెళ్లి వస్తుండగా ఘోర ప్రమాదం
- రామగుండంలో విషాదఛాయలు..





క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన పోలీసులు, హుజురాబాద్ హెల్ప్ టీం

కరీంనగర్/హుజురాబాద్/అక్టోబర్ 24/అక్షరం న్యూస్:

విజయవాడలోని కనకదుర్గమ్మ దర్శనం చేసుకుని తిరిగి వస్తున్న యువకులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రంగాపూర్ శివారులో జరిగిన ఈ ఘోర ప్రమాదంలో రామగుండానికి చెందిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. భవానీ మాల విరమణ కార్యక్రమానికి వెళ్లి తిరుగు ప్రయాణమైన సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో రామగుండంలో విషాదం నెలకొంది.

వెనుక నుంచి లారీని ఢీకొన్న కారు

వివరాల్లోకి వెళ్తే.. రామగుండానికి చెందిన ఏడుగురు యువకులు విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో హుజురాబాద్ పరిసర ప్రాంతంలోని రంగాపూర్ శివారుకు చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న కారు ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు తీవ్రంగా దెబ్బతినగా, అందులో ప్రయాణిస్తున్న యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు.ఈ ప్రమాదంలో రామగుండానికి చెందిన బట్టారి అరవింద్ (20), మచ్చ సాయి (20) అక్కడికక్కడే మృతి చెందారు. వారితో పాటు ప్రయాణిస్తున్న ఎరుకల సాయికృష్ణ, మచ్చ ఆదర్శ్, ముఖియా, వివేక్, శ్రీకర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి.

సమయానికి స్పందించిన పోలీసులు, హెల్ప్ టీం

రోడ్డు ప్రమాద సమాచారం అందుకున్న రూరల్ సీఐ వీరబత్తిని శ్రీనివాస్, పోలీసు సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. హుజురాబాద్ హెల్ప్ టీంకు చెందిన సభ్యులు హర్షద్, షఫీ, నేహాల్, ఇర్ఫాన్ కూడా అక్కడికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గాయపడిన ఐదుగురు యువకులను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించేలా చర్యలు చేపట్టారు.

ప్రమాదంలో మృతి చెందిన యువకుల మృతదేహాలకు సంబంధించి పోలీసులు తదుపరి చర్యలు చేపట్టినట్లుసమాచారం. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

రామగుండంలో విషాదఛాయలు

భవానీ మాల ధరించి కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరగడంతో మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. చిన్న వయసులోనే ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడంతో రామగుండంలో విషాదఛాయలు అలముకున్నాయి. మరో ఐదుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.ఒకే ప్రయాణంలో వెళ్లిన యువకుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం, మరో ఐదుగురు గాయపడటంతో ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

తమిళనాడులో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు ఘనస్వాగతం





- "ఓటును కాపాడుదాం -- దేశాన్ని కాపాడుదాం" కార్యక్రమంలో భాగంగా విరుదునగర్ పర్యటన

మద్నూర్ /అక్టోబర్ 24(అక్షరం న్యూస్ -- కామారెడ్డి)

తమిళనాడు రాష్ట్ర పర్యటనకు వెళ్లిన జుక్కల్ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీకాంతరావుకు విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. "ఓటును కాపాడుదాం -- దేశాన్ని కాపాడుదాం" కార్యక్రమంలో భాగంగా ఏఐసీసీ పరిశీలకుడిగా తమిళనాడులోని విరుదునగర్ పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యేకు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సాదరంగా స్వాగతం పలికారు.

ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా పర్యటన

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యతను ప్రజలకు వివరించడం, ఓటు హక్కు పరిరక్షణపై అవగాహన కల్పించడం వంటి లక్ష్యాలతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తమిళనాడు పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించనున్న కార్యక్రమాలు, సమావేశాల్లో పాల్గొననున్నారు.

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం

ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు విమానాశ్రయంలో స్వాగతం పలికిన స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నాయి.దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రతి ఓటు విలువను ప్రజలకు తెలియజేయడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు భాగస్వామ్యం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

డీజేలు సీజ్ చేసి , పలువురుపై కేసులు

నమోదు చేసిన తల్లాడ పోలీసులు..



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముద్దునూరు గ్రామంలో అనుమతులు లేకుండా డీజేలు ఏర్పాటు చేసి న్యూసెన్స్ సృష్టించిన కొంత మందిపై కేసు నమోదు. నిన్నటి రోజు అనగా ది. 23.10.2026 రాత్రి ముద్దునూరు గ్రామంలోని రామాలయం గుడి సెంటర్‌లో బతుకమ్మ ఊరేగింపు సందర్భంగా రెండు వాహనాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేసి, అధిక శబ్దంతో పాటలు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందింది. అసభ్యకరంగా ఎగురుతూ, వాహనాలను ముందుకు వెనుకకు నడుపుతూ ప్రమాదకరంగా డీజే సౌండ్ పెడుతూ. డీజే లకు తగిన అనుమతులు లేకపోవడంతో పాటు, ప్రజలకు ఇబ్బంది కలిగించిన ఈ ఘటనకు సంబంధించి డీజే నిర్వాహకులు, వాహన డ్రైవర్లు, డీజే ఆపరేటర్లు మరియు ఎలక్ట్రికల్ ఆపరేటర్లు మరియు నిర్వాహకులు పై తల్లాడ పోలీసులు కేసు నమోదు చేశారు. డిజే పాటు వాటిని అమర్చిన వాహనాలను సీజ్ చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేయడం, ప్రమాదకరంగా వాహనాలు నడపడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తల్లాడ ఎస్సై ఎన్ వెంకటకృష్ణ తెలియజేశారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత...
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- ప్రజలకు మెరుగైన రవాణా, విద్యుత్, త్రాగునీటి సదుపాయాల కల్పనకు చర్యలు..
- అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి..
- చింతకాని మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన డిప్యూటీ సీఎం



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ చింతకాని/అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాల కల్పనే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామాల్లో రహదారులు, విద్యుత్, త్రాగునీటి సదుపాయాలను మెరుగుపరుస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు.ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డిలతో కలిసి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పూర్తయిన పనులను ప్రారంభించారు.చింతకాని మండలం పొద్దుటూరు గ్రామంలో రూ.3.5 కోట్లతో చేపట్టనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు, తిమ్మినేని పాలెం గ్రామంలో రూ.8.25 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రామకృష్ణాపురం గ్రామంలో రామకృష్ణాపురం నుంచి కొత్తగూడెం వరకు దేవరపల్లి హైవేను కలుపుతూ రూ.3 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, రామకృష్ణాపురం నుంచి పెద్దగోపతి రోడ్డు వరకు రూ.50 కోట్లతో చేపట్టనున్న రహదారి విస్తరణ, బలోపేతం పనులకు, కొదుమూరు గ్రామంలో వెంకటపాలెం నుంచి చింతకాని రోడ్డు వరకు రూ.60 కోట్లతో నాలుగు వరుసల రహదారిగా చేపట్టనున్న విస్తరణ, బలోపేతం పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. తిమ్మినేని పాలెం ఎస్సీ కాలనీలో రూ.62 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను, గాంధీనగర్ ఎస్సీ కాలనీలో రూ.46 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. మెరుగైన రహదారుల వల్ల గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమౌతుందని పేర్కొన్నారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ మౌళిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామీణ ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలకు అభివృద్ధి పనుల ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కొదుమూరు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ వేముల సతీష్, ప్రజాప్రతినిధులు, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దెగ్లూర్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ వేడుకలు..

- **తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా దెగ్లూర్ లో ఘన వేడుక!**

మద్నూర్ / అక్టోబర్ 24 (అక్షరం న్యూస్ – కామారెడ్డి)

తెలంగాణ సాంస్కృతిక ఆత్మ గౌరవానికి, మహిళల ఆత్మబంధానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్ కేంద్రంలో అత్యంత వైభవంగా, కన్నులపండువగా జరిగింది. సరిహద్దు ప్రాంతమైనప్పటికీ, తెలుగు సంప్రదాయాల పరిమళాలు దెగ్లూర్ గడ్డపై పరిమళించాయి. శనివారం నాడు దెగ్లూర్ నగర పరిషద్ చైర్మన్ విజయమాలా బాలాజీ టెకలే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు మహిళలు అపార సంఖ్యలో తరలివచ్చి కోలాహలంగా పాల్గొన్నారు.

పెళ్లిల తలపించిన వేడుక ప్రాంగణం..

ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖుల భాగస్వామ్యం

?దెగ్లూర్ నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన మహిళలు రంగురంగుల పూలతో ఎంతో అపురూపంగా బతుకమ్మలను తీర్చిదిద్దారు. గౌరమ్మను కొలుస్తూ సాంప్రదాయ బతుకమ్మ పాటలకు తన్మయత్వంతో లయబద్ధంగా అడుగులు వేశారు.ఈ వేడుకల్లో నగరపాలిక సీఈఓ అధికారిణి నీలం కాంబ్లే, నగర పరిషద్ చైర్మన్ విజయమాలా టెకలే,నగర సేవాక్ యోగేశ్రీ మనోజ్ తోటవార్ తో కలిసి స్వయంగా బతుకమ్మ ఆడటం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. అధికారులొకరితో ఒకరు, ప్రజాప్రతినిధులు ప్రజలతో



మమేకమై పండుగ చేసుకోవడం ఈ వేడుకలకు మరింత శోభ తెచ్చింది. విద్యుత్ కాంతులు, సుగంధ భరితమైన పూల అలంకరణలతో బతుకమ్మ ప్రాంగణం అచ్చం ఒక అట్టహాసమైన పెళ్లి రిసెప్షన్‌ను తలపించింది.

మహిళా ఐక్యతకు ప్రతీక బతుకమ్మ:

చైర్మన్ విజయమాలా టెకలే

ఈ సందర్భంగా నగర పరిషద్ చైర్మన్ విజయమాలా టెకలే మాట్లాడుతూ..

"ప్రతి ఏటా దెగ్లూర్ నగరంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడం ద్వారా మహిళలంతా ఒకచోట చేరే అవకాశం కలుగుతుంది. ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, మహిళల మధ్య పరస్పర సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందించే గొప్ప సాంస్కృతిక వేడుక"

అని కొనియాడారు. విభిన్న సంస్కృతుల సమ్మేళనమైన దెగ్లూర్‌లో ఇలాంటి పండుగలు ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలపరుస్తాయని ఆమె పేర్కొన్నారు.

అదనపు సమాచారం: సరిహద్దు ప్రాంతాల్లో బతుకమ్మ విశిష్టత

సాంస్కృతిక వారసత్వం: తెలంగాణకు ఆనుకుని ఉన్న మహారాష్ట్రలోని నాందేడ్, ధర్మాబాద్, ఉద్గిర్ వంటి ప్రాంతాల్లో గణనీయమైన సంఖ్యలో తెలుగు ప్రజలు నివసిస్తున్నారు. సరిహద్దులు వేరైనా, వారి ఆచారాలు, సాంస్కృతిక వేర్లు తెలంగాణతోనే ముడిపడి ఉన్నాయని ఈ వేడుకలు నిరూపిస్తున్నాయి.

?ప్రకృతి ఆరాధన: ప్రకృతిని, నీటిని, పువ్వులను దైవంగా భావించి పూజించే ఏకైక పండుగ బతుకమ్మ. ఇది పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని కూడా చాటుతుంది.అధికారిక వేడుకల ప్రాధాన్యత: స్థానిక పరిపాలనా యంత్రాంగం (మున్సిపాలిటీ సీఈఓ మరియు చైర్మన్) స్వయంగా ముందుండి ఈ వేడుకలను నిర్వహించడం ద్వారా ప్రభుత్వాలు, అధికారులు ప్రజల సాంస్కృతిక మనోభావాలకు ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. ఈ కార్యక్రమం లో నగర పాలిక కౌన్సలార్లు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో మూడు నెలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి...

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- ప్రతి రెండు, మూడు వారాలకు నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించాలి..
- వైఎస్ఆర్ కాలనీలో ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్, ఇంటి పన్ను ధృవీకరణ పత్రం అందించాలి..
- 2023లో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలి..



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో సుడా నిధులు రూ.1.30 కోట్లతో చేపట్టనున్న ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ పాఠశాలలో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు, మూడు వారాలకు ఒకసారి పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.వైఎస్ఆర్ కాలనీలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం కొత్త విద్యుత్ మీటర్లు అందించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. కాలనీలో ఇళ్లలో నివసిస్తున్న వారికి ఇంటి పన్ను ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎవరూ అక్రమంగా విద్యుత్ వినియోగించ కూడదని, ప్రతి ఇంటికి సరైన విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయడంతో పాటు ఇంటి పన్ను ధృవీకరణ పత్రం కూడా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. కాలనీలో నివసించే ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం విద్యుత్ సేవలను వినియోగించుకునేలా చూడాలన్నారు.

2023లో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అంశాలపై సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, సంబంధిత అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలి...

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

రానున్న 10 నెలల పాటు మనుషులు, పశువుల త్రాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి..

విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పైగా పెరిగినా కోతలు లేకుండా నిరంతరాయ సరఫరా..

నీటిని సంరక్షిస్తూ త్రాగునీటికి ప్రాధాన్యమివ్వాలి

నీటి సంరక్షణ పనులతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు చర్యలు..

సూపర్ ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలి..

ఖమ్మం/స్టాఫ్ రిపోర్టర్ చింతకాని/అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 150 దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రానున్న రోజుల్లో తలెత్తే కరువు పరిస్థితు లను ఎదుర్కొనేందుకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.శనివారం ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించిన అనంతరం కొదుమూరు గ్రామంలో డిప్యూటీ సిఎం మీడియా సమావేశం నిర్వహించారు.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూలి సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, దీంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీరు ఆవిరైపోవడంతో పాటు భూగర్భ జలాలు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని అన్నారు. రాబోయే 10 నెలల పాటు మనుషులు, పశువుల త్రాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను కాపాడుకోవాలని సూచించారు.రాష్ట్రంలోని 44 వేల చెరువుల్లో సుమారు 40 శాతం చెరువుల్లో కనీసం పావు వంతు కంటే తక్కువ నీరు ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కరువు పరిస్థితు లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలను ప్రజలు, రైతులు పాటిస్తూ ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరించాలని కోరారు.

విద్యుత్ డిమాండ్ పెరిగినా కోతలు లేకుండా సరఫరా:

రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు గణనీయంగా పెరుగుతున్నప్పటికీ అన్ని వర్గాల ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. 2014లో రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 6,648 మెగావాట్లు ఉండగా, 2023లో 15,497 మెగావాట్లకు చేరిందని, ప్రస్తుతం 20 వేల మెగావాట్లకు పైగా డిమాండ్ నమోదవుతోందని వివరించారు.గృహ అవసరాలు, వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాల వినియోగం పెరగడంతో విద్యుత్ డిమాండ్ అధికమవుతోందని తెలిపారు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో రోజుకు 245 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరం వస్తే, ప్రస్తుతం రోజుకు 335 మిలియన్ యూనిట్ల, దాదాపు 37 శాతం అధికంగా డిమాండ్ పెరిగిందని అన్నారు. డిమాండ్ పెరుగుదలను ముందుగానే అంచనా వేసి, నిపుణులతో చర్చించి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవడం వల్ల విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేయగలుగుతున్నామని తెలిపారు. అక్టోబర్ నెలలో విద్యుత్ అవసరాలు అధికంగా పెరిగినప్పటికీ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని అన్నారు. ఒకవైపు విద్యుత్ డిమాండ్ పెరుగుతూ, మరోవైపు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తి అవకాశాలు తగ్గుతున్నాయని వివరించారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు:

విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ పరిధిలో కొత్తగా 680 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయగా, 177 సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ట్రాన్స్‌కో పరిధిలో 24 సబ్ స్టేషన్లకు అనుమతులు మంజూరు చేయగా, 11 సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని వివరించారు.

పర్యావరణాన్ని కాపాడటంలో ఈ-వేస్ట్ కార్యక్రమంలో పాల్గొనండి

•ప్రిన్సిపాల్ ఎల్ నవీన జ్యోతి



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

మానవాళి రక్షణ కొరకు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని,స్థానిక వైరా పట్టణ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఎల్ నవీన జ్యోతి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కొరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలో, కళాశాలలో, ఈ నెల 28న చేయబోతున్న ఈ వ్యర్థాల అవగాహన సేకరణ ,బాధ్యతాయుతమైన ,డిస్పోజలు డే కార్యక్రమాన్ని ను జయప్రదం చేయవలసిందిగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం మరియు తెలంగాణ విద్యాశాఖ ప్రతిష్టాత్మంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి పర్యావరణాన్ని కాపాడటంలో మనందరం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 28న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎకో క్లబ్బ్ సభ్యులు ఉ అధ్యాపకులు, జి సుధాకర్, డాక్టర్ కోప్పిశెట్టి సురేష్, వై కవిత ,ఎంవి శ్రీనివాస్ రావు కళాశాల ఎన్ఎస్ఎస్పిఓ కంచర్ల శ్రీకాంత్, విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు

కాలుష్య నివారణకు చెట్ల పెంపకం ఎంతో అవసరం

•వైరా 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు పచ్చని చెట్ల పెంపకం ఎంతో అవసరమని వైరా మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత అన్నారు.శనివారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 12వ వార్డులో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని కౌన్సిలర్ మాదినేని సునీత ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో కలిసి వార్డులోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ సునీత మాట్లాడుతూ.. భావితరాల భవిష్యత్తు కోసం మొక్కల పెంపకం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. చెట్లు స్వచ్ఛమైన గాలిని అందించడంతోపాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, అది పెరిగి పెద్దదయ్యే వరకు బాధ్యతగా సంరక్షించాలని ఆమె పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని భావితరాలకు అందించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ అధికారులు వెంకట్రావు, శ్రీను, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్స్ అందరు ఎమ్మెల్సీ

•ఓట్లను నమోదు చేసుకోవాలి ..

•తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి..

•వైరా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు

•శీలం చంద్రశేఖర్ రెడ్డి



ఖమ్మం/వైరా అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లా వైరా మండలం సిరిపురం,గరికపాడు ,గన్నవరం పాలడుగు , గొల్లపూడి రెబ్బవరం,తాటిపూడి గ్రామాల్లో పట్టబద్ధుల ఓటు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు ఎమ్మెల్సీ ఓట్ల ప్రచారంలో భాగంగా మండల అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి మరియు వైరా మండలం అన్ని గ్రామపంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని గ్రాడ్యుయేట్స్ అందరు కూడా ఎమ్మెల్సీ ఓట్లను నమోదు చేసుకోవాలని మరియు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బి ఎల్ ఏ లు,గ్రాడ్యుయేట్స్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర





• జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలత.

•బాలల హక్కులు, బాలల పరిరక్షణ చట్టాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 24 / అక్షరం న్యూస్ –:

బాలల హక్కుల పరిరక్షణ, బాలలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. ప్రేమలత పేర్కొన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో “మిషన్ బాల్ సురక్ష”, శిక్షా మరియు న్యాయ 2026 కార్యక్రమంలో భాగంగా, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన గుర్తింపు పొందిన చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా (నామినేట్ చేయబడిన ఉపాధ్యాయులు) నియమితులైన వారికి బాలల హక్కులు, బాలలకు సంబంధించిన చట్టాలు, విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాలపై ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని శనివారం జిల్లా కోర్టు సముదాయంలోని బార్ అసోసియేషన్ లైబ్రరీ హాల్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. ప్రేమలత మాట్లాడుతూ, ప్రతి బాలుడికి, బాలికకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విద్యా హక్కు, రక్షణ, సమానత్వం, గౌరవప్రదమైన జీవనం అందేలా చూడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తన, వారి మానసిక స్థితి, విద్యాభ్యాసంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, బాలలపై జరిగే వేధింపులు, వివక్ష, నిర్లక్ష్యం, దోపిడీ వంటి అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బాలల హక్కులకు భంగం కలిగించే సంఘటనలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించి, బాధిత బాలలకు అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై ఉపాధ్యాయులు పూర్తి అవగాహన కలిగి ఉండటం ద్వారా పాఠశాలల్లో సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించవచ్చని వివరించారు. విద్యార్థులలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. బాలలకు న్యాయం అందించడంలో సంబంధిత శాఖలు, ఉపాధ్యాయులు, న్యాయ సేవా సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సరిత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ ముదుల్కర్ , డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శంభు ప్రసాద్, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత లేనినా, డిసిపియు మట్ట హరి కుమారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్స్ సాదిక్ పాషా,అంబేద్కర్, లలిత, కళ్యాణి, పాండురంగ విట్టల్, వెంకీ నాయుడు, ఆర్తి మక్కడ్, రాజమణి, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన నామినేట్ చేయబడిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా పాఠశాలను సందర్శించిన

•తల్లాడ ఎండీవో ఏ శ్రీధర్ రాజు

•రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో

• రజిత పథకం సాధించిన విద్యార్థికి అభినందన



ఖమ్మం/ తల్లాడ టౌన్ అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

తల్లాడ: శనివారం 81వ ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా ఫ్యూచర్ జెన్ పాఠశాలను తల్లాడ ఎంపీడీవో అంబటి శ్రీధర్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచ శాంతి,సామరస్యాన్ని కాపాడుతూ దేశభక్తిని గౌరవిస్తూ హక్కుల పట్ల అవగాహనతో ఉంటూ ఇతరుల పట్ల సహకార స్వభావాన్ని కలిగి ఉండాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రపంచంలో ఆర్థిక లాభాపేక్షతో జరుగుతున్న యుద్ధ పరిణామాలను వివరిస్తూ అనేక మంది సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. అందుకని విద్యార్థులు ఒకరికొకరు ఐకమత్యంగా, ప్రజాస్వామ్య యుతంగా జీవిస్తే దేశంలో అశాంతి పరిస్థితులకు తావుండదన్నారు. అంతేకాకుండా విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగం పట్ల దృష్టి సారించే విధంగా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా అండర్ 14 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో పాల్గొన్న ఫ్యూచర్ జెన్ పాఠశాల విద్యార్థి సుమిత్ జాట్ రజత పథకం సాధించినందుకు అభినందించారు. అదేవిధంగా జాట్ కు శిక్షణ ఇచ్చిన పి ఈ టి దిలీప్ కుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను విద్యతోపాటు క్రీడలలోనూ ఇలా మంచి ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులకు , ఉపాధ్యాయులకు మంచి సూచనలు తెలియజేసినందుకు శ్రీధర్ రాజు కు పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి వి. సబిత కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి వి. సబిత, డైరెక్టర్ ఎండి తౌసిఫ్, కోఆర్డినేటర్ ఏ. మధు, ప్రిన్సిపల్ పివి లక్ష్మణ్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

• జిల్లా వైద్యాధికారి వాణిశ్రీ



జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)అక్టోబరు 24: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వాణిశ్రీ అన్నారు. మండలంలోని కోమల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య కేంద్రంలోనిరికార్డులను పరిశీలించి మాట్లాడుతూ పిహెచ్ సి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించి విధులకు సకాలంలో హాజరుకాని సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని, విధులతో పాటు రోగుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం గా వ్యవహరిస్తే... ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సీహెచ్ఓ జైపాల్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు ఇంజమాం అలీ. పావన, సీహెచ్ ఓ సీనారాణి, స్టాఫ్ నర్సులు సుజాత, సరిత, ల్యాబ్ టెక్నిషియన్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

జానపద నృత్య పోటీలకు తిమ్మంపేట విద్యార్థులకు ప్రథమ స్థానం



జఫర్‌గఢ్,అక్టోబర్24, అక్షరంన్యూస్: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు,జిల్లా విద్యాశాఖ సూచనలను అనుసరించి జఫర్‌గఢ్ మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి జానపద నృత్య పోటీలు నిర్వహించారు.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జఫర్‌గఢ్ ఆవరణలో నిర్వహించిన ఈ పోటీలకు మండల విద్యాధికారి మంగు జయప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.మండలంలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 8వ, 9వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ జానపద నృత్య ప్రతిభను ప్రదర్శించారు.మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మంపేట విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించి, జిల్లా స్థాయిలో జరగనున్న జానపద నృత్య పోటీలకు అర్హత పొందారు.పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శిరీష, సునీతాదేవి, మంజుల వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయు లు శ్రవణ్ కుమార్,వేణు గోపాల్,నక్క కుమార్, వంశీకృష్ణ,పిట్టల మహేందర్,రిటైర్డ్ ఉపాధ్యాయులు అంచూరి సురేష్,పల్లె రాజిరెడ్డి, హరిప్రసాద్,విజయ్ కుమార్,సీఆర్పీ పుట్ట స్వామి,ఎంఐఎస్ కోఆర్డినేటర్ మామిడాల శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ -వరంగల్ -ఖమ్మం గ్రాడ్యుయేట్

•ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం ప్రారంభించిన..

• 20 వ వార్డ్ కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు

•అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల

• ఓటరు నమోదు చేసుకోవాలి..

•డీసీసీ హెల్త్ సెల్ చైర్మెన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ, 20 వ వార్డ్ శాంతినగర్ నందు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు ఆధ్వర్యంలో నల్గొండ -వరంగల్ -ఖమ్మం గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీసీసీ హెల్త్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ చేసుకోవాలని తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, సీనియర్ నాయకులు పొదిల్ల హరినాథ్, వైరా టౌన్ ప్రెసిడెంట్ వీరంశెట్టి సీతారాములు, డిసిసి అధికార ప్రతినిధి పమ్మి అశోక్,మాజీ టౌన్ ప్రెసిడెంట్ ఏదునూరి సీతారాములు, మాజీ కౌన్సిలర్ కర్నాటి హనుమంతురావు, కొల్లి రమేష్,భరత్,వార్డ్ కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ళ రాము, బిక్యా, పండు, తేజావత్ నాగేశ్వరావు, హుస్సేన్, పృథ్వి, ఖాజా,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించండి

● మేకల మల్లిబాబు యాదవ్,గుజ్జర్లపూడి రాంబాబు



ఖమ్మం/ వైరా అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

వరంగల్ -నల్గొండ- ఖమ్మం నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, పిఎసిఎస్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం ధనియాకుల హనుమంతరావు, తోటకూరి శివయ్య, గబ్రు నాయక్ పిలుపునిచ్చారు.

కామేపల్లి మండలం కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో శనివారం నాడు కామేపల్లి మండలంస్థాయిలో పట్టభద్రుల సమావేశం జరిగింది. భారీగా పాల్గొన్న పట్టభద్రులసమావేశంలో పాల్గొన్న మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వలన తెలంగాణ అభివృద్ధి కుంటుపడినప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి రేవంత్ రెడ్డి హయాంలో మహిళలకు ఫ్రీ బస్సు పథకం, 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ పథకం, రైతుబంధు,రైతు బీమా లాంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ, ఖమ్మం జిల్లాలో సాగునీరు త్రాగునీటి కోసం సీతారాం ప్రాజెక్టు ద్వారా కాలువలు చెరువులు నింపే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. అభ్యర్థి విషయంలో పార్టీ తగు నిర్ణయం తీసుకున్నదని, రాంరెడ్డి కుటుంబం అంటే ఒక బ్రాండ్ అని, రాష్ట్ర వ్యాప్తంగా ఆ కుటుంబానికి మంచి పేరు ఉన్నదని, ప్రజలలో వారికి ఉన్న మంచితనానికి రాజకీయ అనుభవానికి పార్టీ గుర్తించిందని, అంతేకాకుండా ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి వారి నాన్నగారు మాజీ మంత్రివర్యులు కీ. శే రాంరెడ్డి దామోదర్ రెడ్డి, పెదనాన్నగారు కీ. శే

రాం రెడ్డి వెంకట రెడ్డి ఆశయాల మేరకు ఉన్నతమైన భావాలతో ప్రజలకు సేవ చేస్తున్నారని, ఎంతో ఉన్నతమైన చదువులు చదివి కూడా ప్రజాసేవకు అంకితమయ్యారని, అలాంటి వ్యక్తిని గెలిపించుకోవడం వలన ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నదని, కావున 2023 నవంబర్ ఒకటికి ముందు ఉత్తీర్ణులైన పట్టభద్రులు 18 ఫారం ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, మండలంలో ప్రతి గ్రామంలో గ్రాడ్యుయేట్ లను నమోదు చేసే కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని, పార్టీ కార్యకర్తలు నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి పట్టభద్రుల ఓట్లు నమోదు చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేపల్లి సర్పంచ్ ధరావత్ అనురాధ, పింజరమడుగు సర్పంచ్ భాష, టేకుల తండా సర్పంచ్ రెడ్డి, సాతాను గూడెం సర్పంచ్ రెడ్యా, మాజీ ఎంపీపీ మాలోత్ సరిరామ్ నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు ఉప్పుగండ్ల వీరభద్రం ఆలోత్ శివ, సత్తి వీరబాబు, గుగులోతు రవి, కోల వెంకటేశ్వర్లు చల్ల మల్లయ్య, కాటయ్య పుచ్చకాయల అప్పారావు మల్లెంపాటి అప్పారావు, బద్రు గాడేపల్లి రవి శ్రీరాములు, పాటిబండ్ల ప్రసాద్ శీలం పుల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, పండగ కోటి, తదితరులు పాల్గొన్నారు

స్వర్గీయ శాబాను శ్రీనివాసరావుకు ఘనంగా నివాళులర్పించిన పలువురు ప్రముఖులు



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

ఖమ్మం వాస్తవ్యులు, బీఆర్ఎస్ నాయకుడు స్వర్గీయ శాబాను శ్రీనివాసరావుకు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. అనారోగ్యానికి గురైన శ్రీనివాసరావు ఈనెల మృతి చెందారు.ఈ సందర్భంగా ఆయన దశదిన కర్మకాండ మామిళ్లగూడెం రామాలయం సెంటర్ వద్ద ఉన్న వీవీసీ ఫంక్షన్ హాలులో శనివారం జరిగింది. ఈ కార్యానికి మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా గౌరవాధ్యక్షులు కొత్త సీతారాములు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్,పొన్నం వెంకటేశ్వర్లు, తాళ్లూరి హనుమంతరావు,జీవీఎల్ నర్సింహారావు,శెట్టి రజనీకాంత్,మేడి పవన్ కుమార్,పాల నాగేశ్వరరావు ,గోరెంట్ల రవి,గోరెంట్ల వెంకన్న,శభాసు రమణ,జంగిలి రమణ,ఆకుల సురేష్, బీఆర్ఎస్ నాయకులు ఊటుకూరి రవికాంత్,కోటయ్య,మన్నే రమణ, సుధీర్ తదితరులు హాజరై స్వర్గీయ శ్రీనివాసరావు చిత్రపటానికి పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు.అలాగే వారుదివంగత శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో

● కాంగ్రెస్ నాయకుల సమావేశం

●ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమరెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి..

● పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరంశెట్టి సీతారాములు



ఖమ్మం/వైరా టౌన్ అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

వైరా: వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమరెడ్డి , వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్

నేడు వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విచ్చేయనున్నట్లు తెలిపారు.

ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు

కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో సకాలంలో హాజరుకావాలని సమావేశం ద్వారా విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఏదునూరి సీతారాములు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు వాంకుడోత్ భిక్యా తదితరులు పాల్గొన్నారు.

వైరాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు





ఖమ్మం /వైరా టౌన్ అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ పరిధిలోని పల్లిపాడు క్లస్టర్‌లో వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు ప్రారంభించారు.ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు నమోదులో పాల్గొని, తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రాంపూడి రోశయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాలాది తిరుపతిరావు, కౌన్సిలర్లు రాచబంటి బలరామయ్య, బత్తుల సుమతి, గోరంట్ల శ్రీదేవి, నారపోగు రవి, మెరుగు వెంకటి తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ మండలంలో పట్టభద్రుల ఓట్లు నమోదు కార్యక్రమం..

ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 24(అక్షరం న్యూస్)

ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు పట్టబద్ధులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాఘమయి దయానంద్ గారి ఆదేశాలతో శనివారం తల్లాడ మండలంలోని ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కుర్నవల్లి కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాల ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. పట్టభద్రుల ఓట్లను చేర్పించారు.ఈ సందర్భంగా వీలైనంత త్వరగా పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు గడువు సమీపిస్తున్నందున పట్టభద్రుల ఓట్లు ఇంకా త్వరగా నమోదు చేసే విధంగా కృషి చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుర్నవల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బసవపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు కలకొడిమ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశవపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టభద్రులు పాల్గొన్నారు

ముద్దునూరు ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కేంద్రంగా పరిధిలో ఉన్న గ్రామాల ముఖ్య నాయకులతో నమోదు కేంద్రాన్ని సర్పంచ్ రామ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సందర్శించారు. నూతనంగా చేర్పించే పట్టబదులు వీలైనంత త్వరగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామం సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పట్టభద్రులు పాల్గొన్నారు.



అదేవిధంగా:- రెడ్డిగూడెం గ్రామం సర్పంచ్ మోదుగు తిరుమల్ రావు ఉప సర్పంచ్ జగన్ ఆధ్వర్యంలో ఓట్ల నమోదు కేంద్రాన్ని సందర్శించారు ఈ సందర్భంగా నూతన పట్టభద్రులను చేర్పించారు ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టభద్రులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తాం..

● న్యాయపరమైన చిక్కులు లేకుండా నివాసయోగ్యమైన ప్రాంతంలో స్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ..

● జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది..

● రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 24 (అక్షరం న్యూస్)

హైదరాబాద్:- తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆకాంక్షలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 లో జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని మంత్రి గుర్తుచేశారు. అయితే, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియ సుదీర్ఘకాలం నిలిచిపోయిందని తెలిపారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగిన తర్వాత కూడా గతంలో ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చొరవ తీసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి 2024 సెప్టెంబర్ 8వ తేదీన రవీంద్ర భారతిలో కార్యక్రమాన్ని నిర్వహించి భూమిని సొసైటీకి అప్పగించడం జరిగిందన్నారు. అనంతరం సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావడంతో ఈ అంశానికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే అంశంపై సమగ్రంగా సమీక్షించినట్లు మంత్రి వెల్లడించారు.



జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయాలన్నది మా ప్రభుత్వ సంకల్పం.

గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, చట్టపరమైన చిక్కులు లేని విధంగా, కుటుంబాలతో గౌరవంగా నివసించేందుకు అనువైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని మరోసారి కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతోపాటు, వారికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరేలా, అందరికీ ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609